




నాలుగేళ్ళయింది నాదేశం విడిచిపెట్టి- మళ్ళీ యిదే చూడ్డం.

స్టేషన్లో దిగాను. గోపన్న వచ్చాడు. సామాను తీసుకువెళ్ళి జట్కాలో వేశాడు; జట్కాదగ్గరికి వచ్చాను. ఒక్కసారి వూరంతా కలయచూశాను. యిదేనా అనుకు అనిపించింది; చాలా మారింది. నాలుగేళ్ళక్రితం నవ్వుతున్న నాలుగేళ్ళ పాపలా వుండేది - యిప్పుడు పమిట సర్దుకొంటున్న అమ్మాయిలా వుంది.

"ఎక్కండి బాబూ!" గోపన్న పిల్చాడు.

జట్కా ఎక్కాను. జట్కా వాడు తోలుతుంటే గోపన్న పక్కన నడుస్తున్నాడు. గుర్రం నడుస్తోంది. చిన్నప్పుడు గుర్రాలు పరిగెడతాయని చదివాను, కానీ యిది నడిచేగుర్రంలా వుంది. గుడ్డిది కాకపోయినా దానా వున్నట్టు లేదు దీనికి. సినిమాలో యన్టీ. రామారావు గుర్రంలా వుంది. ఆలోచిస్తున్నాను - ఊరు వూరుకోలేదు. అందంగా అమ్మాయిలా పెరిగింది. గోపన్న కూతురు కూడా పెరిగివుంటుంది - వూరులాగే -




ఏపుగా, ఎంచక్కా, ఎలిజబెత్ టేలర్ లా_

"గోపన్నా!" పిల్చాను.

"బాబూ!"

"బావున్నావా?"

"ఏవో మీ దయ బాబూ! కూతురికి పెళ్ళికూడా సేసేసినాను." కూతురిమీద ఆలోచన పసిగట్టినట్టు చెప్పాడు.

'అమ్మ పెధవా!' అనుకున్నాను.

"ఎవరితో?" అన్నాను.

"ఆ డుత్త ఎదవ బాబూ! ఏలుకోడం మానేసి పట్నం ఎల్లి పోయాడు. ఎప్పుడో డబ్బుచ్చుకు తిరిగొత్తాట్ట — సన్నాసెదవ!"

గుర్రం తుమ్మింది.

గోపన్న అడిగాడు_ "మరి తవరి పెళ్ళెప్పుడు, బాబూ!"

"నువ్వు చేస్తావా?" సగం నవ్వుతూ అన్నాను.

"ఎంతమాట బాబూ! ఎత్తుకు మోసి నోణ్ని. తవరిపెళ్ళికి పల్లకీ మొయ్యాల్సింది నేనేగదు బాబూ!" గోపన్న భుజాలు వుత్సాహంగా వూగాయి. ఆ భుజాలమీద ఎన్ని పెళ్ళి పండగలు చేశాడో లెక్కలేదు. పవిత్రత బరువుతో అవి బలంగా పెరిగిన ట్టున్నాయి.

"బాబూ — పెదబాబుల పెళ్ళిల్లన్నీ యీ బుజాలమీదే సేశాను. మీ పెల్లి కూడా నా పల్లకీలోనే వూరేగాలి బాబూ — ఏటో! ఇప్పు డంతా మారిపోయింది. పల్లకీ లెక్కే పెబువులే లేరు. నాగరికతబాబూ, నాగరికత. నేనే ఏటో తాపత్రయం వదన్నేక నా పల్లకీ పట్టుకు ఏల్లాడుతున్నాను. మరి దానికి పెబువులీ, పనోన్నీ నేనేకదు బాబూ." గోపన్న కబుర్లు వింటున్నాను.

గోపన్న మా సరితాశ్రమంలో తోట మాలి. ఏళ్ళతరబడిగా అక్కడే వుంటు న్నాడు. వాడికి పల్లకి ఒకటుంది. సరితాశ్రమంలో పెళ్ళిళ్ళన్నీ వాడి భుజాలమీదే జరగాలి — దారిలో సింగన్నకొట్లో సిగరెట్లు కొన్నాను.

యింటిదగ్గర జట్కా ఆగింది, దిగాను.

* * *

సాయింత్రం బాల్కనీలోకి వచ్చి చూశాను. చుట్టూరా ప్రహరీ — పురాతనంగా, బలిష్ఠంగా — గోపన్న భుజాల్లా, ఎత్తుగా, రక్షణలా — గోపన్నలా వుంది. పక్కనే 'గోస్తనది'కాలువ పారుతోంది. ఆవరణలో అరటిచెట్లు, సపోటాచెట్లు, దూరంగా బొగడచెట్టు — సరితాశ్రమానికి నే నొక్కణ్నే అధిపతి నై నందుకు అర క్షణం గర్వపడ్డాను. అంతలో — బొగడ చెట్టు నీడలో గోపన్న వుండే బొట్ హౌస్ ముందు వంగొని కనకాంబరం మొక్కకి నీళ్ళు పోస్తున్న గోపన్నకూతురు సీతాలు కనబడింది, అటువేపు తిరిగి. అటువేపు తిరిగిన అప్సరసలా వుంది. సరస కొస్తే బాగు న్నా ని వుం ది. 'సీతాలూ!' అని పిలిస్తే వింది. కాస్సే పటికల్లా వచ్చి మెట్లమీద ఆగింది.

"ఆ ఫ్లాస్కుతో కాఫీ తీసుకురా." చిల్లర యిచ్చాను. సీతాలు వెనక్కి తిరిగింది. అంచేత మెట్లు దిగేవరకూ చూశాను. గోపన్న వుత్తము డనిపించింది. నిజంగా గోపన్న మంచివాడైనా యిది వర కెప్పుడూ యిలా అనిపించలేదు — కాని యిప్పుడు — సీతాల్లాంటి కూతుర్ని కన్నందుకేమో!

గోపన్న చాలా పురాతనమైనవాడు. మా సరితాశ్రమమంత పురాతన మైనవాడు. ఊళ్ళో గోస్తనదంత పురాతన మైనవాడు. చరిత్రలా, నాగరికతలా పురాతనమైనవాడు. చరిత్రని శోధిస్తే చక్కని కథ లున్నట్టూ, పురాతన శిధిలాల్ని తవ్వితే పువ్వుల్లాంటి విగ్రహాలు



బయల్పడినట్టు, గోపన్న సంసారం చేస్తే గోపికంత అందంగా సీతాలు పుట్టినట్టూ ఉంది. అందానికి అంతస్తులూ, కులమత బేధాలూలేవు; పేద, గొప్ప తేడాల్లేవు. అన్యాయం, అవినీతి అక్కర్లేదు. ప్రభుత్వంలా కాక అందరూ మనుషులే నని షెడ్యూల్డుకి, ఫార్వర్డుకి కూడా సౌందర్యం స్కాలర్ షిప్పుగా యిస్తుంది. అందర్నీ సమానంగా పంచుకుంటోంది.

సీతాలు కాఫీ తెచ్చింది. వంగొని గ్లాసులో పోస్తోంది – యిందాక కనకాంబరం మొక్కకి నీళ్ళు పోస్తున్నట్టు. నేను కాఫీనీ చూడలేదు, సీతాల్నీ చూడలేదు. వంగొంటే వొంటి నగిషీల్ని చూశాను. మరి నేను మగాణ్ని; నాతప్పుకాదు. గది వూడవమన్నాను. వంగొని చేసే వన్లన్నీ చెప్పాలనివుంది.

కాఫీ త్రాగుతుండగా సీతాలు పని పూర్తిచేసి పెరట్లోకి వెళ్ళిపోయింది.

సాయంత్రం చినుకులు పడ్డాయి. బొగడపళ్ళరాలి మట్టిలోతడిసి తోటంతా సువాసనగావుంది. ఆకాశంనిండా యింకా మేఘాలు అటూ యిటూ తిరుగుతున్నాయ్ – త్వరగా వర్షమై నిన్ను చేరాలనివుంది అని – పెరట్లో సీతాల్ని ప్రేమిస్తున్నట్టు.

చీకటిపడింది.

భోంచేశాక గోపన్న పడుకోడానికి మేడమీది కొచ్చాడు, పెళ్ళికబుర్లూ, పల్లకీకబుర్లూ చెబుతుండగా పనిబడలిక

గోపన్న కళ్ళమీద నిద్రమబ్బులిన్ని కప్పింది. వాటిమీద గోపన్న కంబళీ కప్పుకున్నాడు. వాడికి బాగా నిద్రపట్టింది.

నాకింకా నిద్ర రావడంలేదు. బాల్కనీలోకి వచ్చాను. నిద్ర బాల్కనీలో వుంటుందని కాదు. ఒంటరితనం బాధిస్తోంది. పెరట్లో చెట్ల సందుల్లోంచి దూరంగా ప్రహరీదగ్గర బొగడచెట్టు నీడలో గోపన్న ఔట్‌హౌస్ మసగ్గా కనబడుతోంది. లోపల దీపంవెలుగు సన్నగా కదుల్తోంది. ఆవెలుగులో అటూ యిటూ కదిలిన సితాలి నీడని నేను గుర్తుపట్టాను – ఎత్తుగా ఎదిగిన సీతాలు మత్తుగా అనిపిస్తోంది. ఏవో ఆలోచనలు –

* * *

వొంటిమీది కిరణాల వెచ్చదనానికి వొళ్ళు తెలిసింది. లేచి విరుచుకున్నాను. బాల్కనీలోకి వచ్చాను గోపన్న యింటిదగ్గిర గోలగావుంది. జనం చాలా వున్నారు – ఏదో వుపద్రవం జరిగినట్టు. కాస్త కంగారుపడ్డాను. గబగబా అకు చెప్పులు తొడుక్కొ నిక్రిందికి దిగి బొగడ చెట్టువేపు నడిచాను. దగ్గిరికి వెళ్ళేసరికి సగంమంది పైగా తగ్గారు. మిగిలినవాళ్ళు పక్కకి తొలిగారు. తలెత్తిన గోపన్న తలమీద చేతులు వేసుకొని గోలెత్తాడు.

"బాబో! అయిపోయింది. నాబతుకు తెల్లారిపోయింది. సీతాలు బాబూ – నాకూతురు – కాలవలోపడి సచ్చిపోయింది బాబూ – గంగమ్మతల్లో –"

హఠాత్తుగా బొగడచెట్టు విరిగి నెత్తిన పడినట్టయింది నాకు. జాలిగాచూశాను. సానుభూతికి ప్రతినిధుల్లా చుట్టూ నలుగురు మనుషులు మాత్రం మిగిలారు. గోపన్న ఏడుపు నా కెప్పుడూ అలవాటులేదు. అది యింతలో ఆగేదికాదని తెల్చుకున్నాను. దెబ్బతిన్న హృదయంతో తల వొంచుకొని వెనక్కి తిరిగాను.

నా గదిలోకొచ్చాను. నా గదిలో కొచ్చినట్టులేదు; విషాదం తట్టుకోలేని మనసు విషణ్ణతతో వణుకుతోంది. అలాగే గడిపాను.

సాయంత్రమైనా నా వొంట్లో దీనత్వము తొలగలేదు; నా యింట్లో దీపాలూ వెలగలేదు; నా కంట్లో సీతాలు చెరగలేదు. సరితాశ్రమంలో దీపంలా వెలిగిన సీతాలు ఆరిపోయింది. అవును, వెలిగే గుణంతోబాటు, ఆరిపోయే గుణంకూడా వుంది కాబట్టే దీపం అన్నారు.

రాత్రి –

నాకు నిద్రపట్టలేదు.

అంతరంగంలో ఆలోచనలు అస్తవ్యస్తంగా ఆక్రమిస్తున్నాయి. సీతాలు ప్రమాదవశాన్న పోయిందో, ఆత్మహత్య చేసుకుందో అంతుచిక్కడంలేదు. ఆత్మహత్య అంటే ఆడది తప్పువొప్పుకోడం. మరి సీతా లేం తప్పు చేసింది. నా కేం అర్థం కావడంలేదు. పక్కమీద అటూ యిటూ దొర్లాను. దొర్లితే అర్థమవుతుందని కాదు – ఆలోచనల్తో నిద్రపట్టక.



లేచాను. బాల్కనీలోకి వచ్చాను. బొగడ చెట్టువేపు చూశాను.

ఆశ్చర్యం! - గోపన్న! -

హరికేన్ లాంతరు వెలుగులో ఆతడి ప్రతికదలికా చిత్రంగా కనిపిస్తోంది. అశ్రద్ధ చేసిన పవిత్రతలా పడున్న మూరుక్రింది పల్లకీని నెమ్మదిగా తీసి ఇంటిముంగిట పెట్టాడు. భుజంమీది గుడ్డతో బూజుల్ని దులిపాడు. పాత కర్రల్ని తెచ్చి పల్లకీలో వేశాడు. పెళ్ళికి సిద్ధం చేసినట్టు జరీదుప్పటితో చక్కగా అలంకరించాడు. అంతా చేసి క్షణంసేపు పల్లకిని ప్రేమగా చూశాడు. దీపం వెలుగులో పల్లకి పర్జన్యలక్ష్మిలా గుంది.

మరుక్షణం గోపన్న లోపలికి వెళ్ళాడు. డబ్బా తీసుకువచ్చి పల్లకిని

ఆముదంతో పూర్తిగా తడిపి, అగ్గిపుల్ల గీసి విసిరాడు. పల్లకి భగ్గు మంది. నా నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. నేను చలించాను. చరచరా మెట్లు దిగి బొగడ చెట్టువేపు పరిగెత్తాను. వెలిగే పల్లకీకి కొంతదూరం యివతల పరుగు మరచి పోయాను – అడుగులు ముందుకి వేస్తున్నాను. ఎదురుగా ఆందోళిక అగ్నిపరమై పోతూంటే ఎందుకో ఆందోళన అంతు మీరిపోతోంది. ముత్యాలభదనం మండి పోతూంటే మనసులో దావాగ్ని మతిచెడగొడుతోంది. నాలుగ్గజాల ఇవతల గోపన్న మోకాళ్ళమీద కూర్చుని తల వంచుకుని మౌనంగా రోదిస్తున్నాడు. నా కా దృశ్యం బౌద్ధభిక్షువు ఆత్మాహుతిలా గుంది.

"గోపన్నా!" దగ్గరకి నడిచి పిలిచాను.

"బాబూ!" గోపన్న బావురు మన్నాడు. తటాలున లేచి దగ్గిరసా వచ్చి నా చేతులు పట్టుకొని, నా మొహాన్ని చూస్తూ చెప్పాడు – "బాబూ! – అంతా – కాలిపం – నేనే బాబూ! నేనే జన్మిచ్చినోన్ని. జన్మ తీసేశాను. సంపేశాను బాబూ! ఇవే – ఆ సేతులు. ఆ సేసిన సేతులు – బాబూ! యీ సేతులమీదే – యిదిగో యిదే నా పల్లకి – యిండులోనే దానికి పెళ్లి సేశాను. కాని – కానీ బాబూ! అది సెడిపోనాది. పాపం సేసింది. పాపానికి సావే మందు బాబూ! సంపేశాను." క్షణం ఆగి మళ్ళా చెప్పాడు: "ఎన్నేళ్లో బాబూ! ఈ పల్లకీని పయిత్రంగా, పేనంలా దాశాను. దీనిమీద ఆకరుపెళ్లి దాన్దేబాబూ! అపయిత్రం సేసేసినాది బాబూ! మీ వుప్పుతిని బతికినోణ్ణి. నే సచ్చేలోగా తవర్ని పెళ్లికొడుకులా సూసి, నా బుజాలమీద, నా పల్లకిలో మొయ్యాలనుకున్నాను. కాని అదింక పనికిరాదుబాబూ – సమించండి మహాప్రభో, సమించండి!–"

నా కింక గోపన్న మాటలు వినబడ లేదు పవిత్రదేవత ఆత్మశాంతికి వెలిగించిన సమిధలా పల్లకి మండుతోంది. నా హృదయమూ అలాగే మండుతోంది. నా వంశం విలువ నాకంటే గోపన్నకే ఎక్కువ తెలుసు ననుకుంటున్నాడు. విశ్వాసం అంటే యిదే కాబోలు.

మంటవేడికి బొగడచెట్టు ఆకులు కందినట్టు నా మొహం కందిపోతుందని అద్దం చూసుకోకపోయినా తెలుస్తోంది.


గదిలోకి వెళ్ళాను; లైటు వేశాను.

"బాబూ!" – వెనక్కి చూసేను. రంగన్న. కిక్కొట్టునాడు.

"ఏంటి?" అన్నాను అలాగే వుండి.

"పల్లకి మరిసిపోయాను బాబూ!"

నేను మరచిపోలేదు. వెనక వాడిదగ్గరకి వెళ్ళాను. కోపంగా – "ఇప్పుడా నీకు వేళ కుదిరింది?" అన్నాను హఠాత్తుగా. వాడు నా కాళ్ళమీద పడ్డాడు – "బాబూ! ఆడిబో సెప్పకండి బాబూ! నన్ను సంపేత్తాడు."




"ఏమిటి ?"

"నిన్నరేత్తిరి తమరు మేడమీది నించి నన్ను సూశారుబాబూ! మీకు తెలుసుబాబూ! కాని బాబూ_ఎంత పేమించినా_పల్లకీలో పెల్లయిన పిల్లని ఎలా కట్టుకోను బాబూ! అయినా లేచి పోడానికి నిచ్చయించుకున్నాం. కానీ మీలాగే ఆడికీ తెల్సిపోయింది బాబూ! ఆ డసలే కూతుర్ని సంపిన రాచ్చసుడు. మీరే నన్ను కాయాలి బాబూ! ఏదో తప్పు సేశాను.''

''ఏం తప్పు ?''

"అదే బాబూ_పేవించాను.''

"అది తప్పా ?''

''పెల్లిని గౌరయిస్తే తప్పేబాబూ!"

"సరేలే పో! నాకు నిద్రొస్తోంది.''

''బాబూ_"

"అలాగే_వెళ్ళు." వాణ్ని పంపించి తలుపు వేసేశాను, బెడ్ దగ్గరికి నడిచాను.

పెళ్ళయి ప్రేమ కోల్పోయినవాళ్ళకి ప్రేమించే అర్హత పోతుందనుకుంటా. నిన్నరాత్రి నేనసలు వాణ్ని చూడలేదు. వాడు నన్ను చూసి అలా అనుకున్నాడు. నాకిప్పుడు అర్థమైంది. నాకు సీతా అంటే యిప్పుడు అసహ్యం. నేను అందాన్ని గౌరవిస్తాను. అందులోనే తప్పు కనబడింది; అది నేను సహించలేను.

కిటికీలోంచి చల్లగా ప్రవహిస్తున్న గోస్తనది కనబడుతోంది. ఆ నీటిలోనే సీతాలు పోయింది_పవిత్రమైన నీరు. ఎప్పటికైనా పాపాన్ని పవిత్రతే హరించాలేమో!_నాకు తెలియదు.

———